
ఉదయం రెక్కీ
రాత్రికి చోరీ..

2


2
నీటమునిగి
యువకుడు మృతి



AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## రేపు మెడికల్ షాప్‌లు బంద్




**అక్షరటుడే, కోటగిరి:** ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ బుధవారం మెడికల్ దుకాణాలు మూసివేయనున్నట్లు మెడికల్ షాప్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు ఉమ్మడి మండల అధ్యక్షుడు సాయిలు, జనరల్ సెక్రెటరీ సీతలే విజయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. దుకాణాల బంద్‌కు ప్రజలు సహకరించాలని.. అత్యవసర సదుపాయాలు, మందుల కోసం 9912011220, 9989264064 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


19-5-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


**జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం భారీగా పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం పెరిగి ప్రజలు ఉచిత కరెంట్‌కు దూరమవుతున్నారు. కొన్ని నెలలుగా 'గృహజ్యోతి' పథకంలో భాగంగా జీరో బిల్లు పొందుతున్న వినియోగదారులకు ఎండలు షాక్ ఇస్తున్నాయి. జనవరి నుంచి మార్చి వరకు 200 యూనిట్లలోపే పరిమితమైన విద్యుత్ వినియోగం, ఏప్రిల్, మే నెలల్లో ఒక్కసారిగా గిర్రున తిరిగి 200 యూనిట్ల పరిమితిని దాటేసింది. ఫలితంగా రూ.వెయ్యికి పైగా కరెంట్ బిల్లు వస్తోంది.** – అక్షరటుడే, భీమ్‌గల్

# మండుతున్న ఎండలు..
# గృహజ్యోతిపై ఎఫెక్ట్



■ భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం ■ 200 యూనిట్లు దాటడంతో ఉచిత విద్యుత్‌కు దూరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'గృహజ్యోతి' పథకం కింద తెల్ల రేషన్ కార్డు ఉండి, నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ప్రతి గృహానికి ఉచితంగా (జీరో బిల్లు) కరెంటు అందిస్తున్న సంగతి తెలిసిందే. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 3.20 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో దాదాపు 2.10 లక్షల మంది వినియోగదారులు ఉచిత విద్యుత్ పొందుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి ఎండలు ముదరడం, పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటడంతో ఇళ్లలో నిరంతరాయంగా ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు నడపక తప్పని పరిస్థితి ఏర్పడింది. గృహాల్లో విద్యుత్ వినియోగం సగటున 20 నుంచి 30 శాతం వరకు పెరిగింది. ఈ క్రమంలోనే గతంలో 160 నుంచి 180 యూనిట్ల లోపే వాడిన మధ్యతరగతి, పేద కుటుంబాల రీడింగ్ సైతం ఈ వేసవిలో 210 నుంచి 240 యూనిట్లకు పైగా దాటిపోయింది.

### వినియోగం తగ్గితే..

విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బిల్లింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఏ నెలకైనా 200 యూనిట్లు దాటితే ఆ నెలకు ఉచిత కరెంటు వర్తించదని స్పష్టం చేస్తున్నారు. ఎండలు తగ్గుముఖం పట్టి, రాబోయే రోజుల్లో మళ్లీ వాడకం 200 యూనిట్ల లోపుకు వస్తే జీరో బిల్లు వర్తిస్తుందని పేర్కొంటున్నారు.

### ఆందోళనలో వినియోగదారులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెలవారీ వినియోగం 200 కంటే ఒక యూనిట్ దాటినా పూర్తి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని రోజులు ఉచిత విద్యుత్ పొందిన ప్రజలు.. ఒక్కసారిగా భారీగా బిల్లు కట్టాల్సి రావడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నెలకు రూ.1200 నుంచి రూ.1800 వరకు బిల్లు వస్తోందని చెబుతున్నారు. విద్యుత్ వినియోగం తగ్గించాలని అనుకున్నా ఎండల ధాటికి కూలర్లు, ఫ్యాన్లు 24 గంటలు వాడాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిసేపు కూలర్లు ఆపేస్తే ఇంట్లో ఉండలేకపోతున్నామని చెబుతున్నారు. దీంతో వేసవి కాలంలో ఉచిత విద్యుత్ పరిమితిని 250 యూనిట్లకు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



## సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

**అక్షరటుడే, కోటగిరి :** వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై జీలుగ విత్తనాలను మంగళవారం నుంచి అందజేస్తున్నట్లు మండల ఏవో నిషిత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి పోతంగల్ మండల కేంద్రంలోని ఎల్ఎస్‌సీఎస్ రైస్‌మిల్ వద్ద పంపిణీని ప్రారంభించామన్నారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా రూ.4,905 ఉండగా సబ్సిడీ పోను రూ. 2,452 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. రెండున్నర ఎకరాలకు ఒకబస్తా, ఐదెకరాలకు రెండు బస్తాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, గంధపు పవన్, దిలీప్ కుమార్, సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## భువన్ సర్వేతో బయటపడ్డ కామారెడ్డి ఆస్తిపన్ను బకాయిలు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పురపాలక సంఘంలో ఆస్తిపన్ను వసూళ్లలో భారీగా లోటుపాట్లు బయటపడ్డాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి వెల్లడించారు. భువన్ సర్వే ప్రకారం ఏకంగా 5617 అసెస్మెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మే నెల 2న విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం నిర్వహించిన భువన్ సర్వేలో ఈ వివరాలు వెలుగుచూశాయని చెప్పారు. 2021-22, 2022-23లలో భువన్ యాప్ ద్వారా రూ.1.04 కోట్ల ట్యాక్స్ వసూలు చేసినట్లు వివరించారు. పట్టణంలో ఇంటి నెంబర్లు లేని ఇళ్లు సుమారు 480 వరకు ఉన్నట్లు వార్డు అధికారులు గుర్తించారని, అలాంటి ఇంటి యజమానులకు డాక్యుమెంట్లు, పర్మిషన్ కాపీ, ఇంటి ఫొటో సమర్పించాలన్నారు. 2024-25, 2025-26లో కొత్తగా రిజిస్ట్రేషన్ అయిన 1,140 ఇళ్లకు నెంబర్లు కేటాయించినట్లు చెప్పారు. 2024-25, 2025-26 మధ్య కాలంలో అండర్ అసెస్ ద్వారా 3,921 ఇళ్లను గుర్తించి రూ.2.80 కోట్ల వరకు పన్ను పెంపుదల చేసినట్లు వెల్లడించారు. 2007 గెజిట్ రిజిస్టర్ ప్రకారం పట్టణాన్ని జోన్ 1, 2, 3, 4లుగా విభజించి కమర్షియల్ ట్యాక్స్ విస్తరించనున్నట్లు తెలిపారు. భువన్ సర్వే తర్వాత మొత్తం రూ.3.84 కోట్ల మేర ఆస్తిపన్ను పెంపుదల జరిగినట్లు ఛైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

## పోలీసు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అందించడంపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదో టౌన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్, భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంతో స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్.. కేసుల నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, బీట్ డ్యూటీ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో అమలవుతున్న 5-ఎస్ విధానం అమలు తీరును సమీక్షించారు. ఆయన వెంట ఏసీపీ ప్రకాష్ యాదవ్, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ , ఎస్సై-2 లక్ష్మయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించిన జిల్లా జడ్జి



**అక్షరటుడే, ఇందూరు:** ఇటుక బట్టీల్లో కొన్ని నెలలుగా నిర్బంధంగా వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులకు జిల్లా న్యాయమూర్తి భరతలక్ష్మి విముక్తి కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఆర్మూర్ నియోజకవర్గంలోని దేగాంలో ఉన్న ఇటుక బట్టీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన అనేక మంది కూలీలతో మాట్లాడారు. నిర్బంధంగా పనిచేస్తున్నట్లుగా గుర్తించిన ఆమె జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వారిని సొంతూళ్లకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. దేగాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలను సందర్శించగా ఇక్కడ ఘోరమైన పరిస్థితులు కనిపించాయని తెలిపారు. కొన్ని నెలలుగా కార్మికులను బట్టీల్లోని రేకుల షెడ్లలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా చిన్నపిల్లలతో సహా ఉంచుతున్నారన్నారు. వారి దయనీయ పరిస్థితి చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుందన్నారు. బట్టీల్లో పనిచేస్తున్న నిర్బంధ కార్మికులకు సరైన పనివేళలు ఇవ్వకుండా రాత్రింబవళ్లు వారితో పనిచేయించుకుంటున్నట్లుగా తెలుస్తోందన్నారు. ఒక్కో ఇటుక బట్టిలో 20 మంది కార్మికులు పనిచేస్తున్నట్లుగా లైసెన్స్ తీసుకుని వందల సంఖ్యలో పనివాళ్లతో నిర్బంధంగా పనిచేయిస్తున్నట్లు గుర్తించామని ఆమె తెలిపారు. ఇక్కడ నిర్బంధంగా పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. ఇటుక బట్టీల నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్నిరోజులుగా వారు పనిచేసిన రావాల్సిన డబ్బులు ఇప్పిస్తామన్నారు.

## చెరువుల మరమ్మతులపై అలసత్వం వహించొద్దు



**అక్షరటుడే, డిచ్‌పల్లి**: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో చెరువులు, చెక్‌డ్యాంల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని.. అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆ మేరకు ఎమ్మెల్యే తన నివాసంలో ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ముత్యాల చెరువు గత వర్షాకాలంలో దెబ్బతినగా వెంటనే మరమ్మతులు చేయించాలని మండలంలోని వాడి, హొన్నాజీపేట గ్రామ రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు మరమ్మతు పనులకు సంబంధించిన ప్రణాళికను మ్యాప్ పాయింట్ ద్వారా ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. అదేవిధంగా చెరువు రక్షణార్థం ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలోని చెక్‌డ్యాంల అంశంపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల విడుదల తదితర అంశాలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. కాగా.. నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వర్షాకాలం కంటే ముందే పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ నజీర్ హుస్సేన్, ఈఈ నరేంద్ర కుమార్, డీఈ ప్రేమ్ కుమార్, ఏఈలు సాయినాథ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తీర్చిన ఘనత షబ్బీర్ అలీదే..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపిన ఘనత ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకే దక్కుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 20 ఏళ్ల క్రితం ఎండాకాలం వస్తే ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. వైఎస్సార్ హయాంలో మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ శ్రీరాంసాగర్ నుంచి 110కి.మీ. పైపులైన్ వేయించి, మల్లన్నగుట్ట వద్ద ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి గోదావరి జలాలు తెచ్చారని తెలిపారు. దీంతో పదేళ్లు నీటి కష్టాలు తీరాయన్నారు. ప్రస్తుతం పెరిగిన అవసరాలకు అనుగుణంగా అటవీ, ఆర్అండ్‌బీ అనుమతులు సాధించి కొత్త పైపులైన్ పనులు పూర్తి చేయించారని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 4 ఎంఎల్‌డీ నుంచి 19 ఎంఎల్‌డీ వరకు నీటి సరఫరా పెరుగుతుందని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఆర్మూర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి విస్తృత పర్యటన



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా లెదర్ పార్క్ స్థలాన్ని పరిశీలించారు. అందులో అనుమతులు లేకుండా నివాసముంటున్న వారు శాశ్వత ప్రాతిపదికన మరెక్కడైనా నివాసముండేలా చూడాలన్నారు. మొరం తవ్వకాలు పర్మిషన్ లేకుండా జరుగుతున్నాయని వాటిని ఆపాలన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా సరే మైనింగ్ రూల్స్ ప్రకారమే మొరం తవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న వారికి శాశ్వత పరిష్కారాన్ని చూడాలని విధి విధానాలు అధికారులు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్మూర్ తహశీల్దార్ సత్యనారాయణ, కౌన్సిలర్లు శ్రావణ్, పాన్ శీను, బొట్టు రాజు, యామాద్రి భాస్కర్, మామిడిపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, కిషన్ మోర్చా ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మైలారం బాలు తదితరులు పాల్గొన్నారు.



## అమరవీరుల పార్క్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని అమరవీరుల పార్క్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలని మేయర్ ఉమారాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పార్క్‌ను సందర్శించారు. ఇటీల పార్క్‌కు సంబంధించి అడ్‌హక్ కమిటీ సభ్యులు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మేయర్‌ను కలిసి సమస్యలు వివరించారు. దీంతో స్పందించిన ఆమె పార్క్‌ను సందర్శించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన ఉన్నందున మైనర్‌పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం పార్క్‌లో సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ, స్థూపం మరమ్మతులు చేయాలని సూచించారు. వీటిని సంబంధించిన ఎస్టిమేషన్స్ వేసి తనకు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు ఆయుష్ పురుషోత్తం, డాక్టర్ రాజేందర్, టీచర్ రమేష్, పంతులు, గణపతి రావు,దయానంద్, సంపత్, సీనియర్ సిటిజన్స్, మహిళలు పాల్గొన్నారు.



## ఇళ్ల పట్టాల పంపిణీలో జాప్యంపై లబ్ధిదారుల నిరసన

**అక్షరటుడే, బాన్సువాడ:** బీఆర్ఎస్ హయాంలో తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చినప్పటికీ పట్టాలు ఇవ్వలేదని బాధితులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం బీర్కూర్ మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. పట్టా పంపిణీ రోజు రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా కొంతమందికి మాత్రమే సర్టిఫికెట్లు అందజేశారన్నారు. మిగిలిన వారికి ఇప్పటికీ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేదని లబ్ధిదారులు ఆరోపించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు 30 నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో ముగ్గురు ఆర్డీవోలు, నలుగురు తహశీల్దార్లు మారినప్పటికీ పట్టాల పంపిణీ మాత్రం ముందుకు సాగలేదని నిరసన వ్యక్తం చేశారు. పట్టా సర్టిఫికెట్లు సిద్ధమై ఏళ్లు గడుస్తున్నప్పటికీ వాటిని పంపిణీ చేయకపోవడాన్ని నిరసిస్తూ లబ్ధిదారులంతా తహశీల్దార్ సవాయి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లోపు పెండింగ్‌లో ఉన్న పట్టా సర్టిఫికెట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అధికారులు..



అక్షర టుడే కథనానికి స్పందన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 'లారీలు రావు.. ధాన్యం పోదు' శీర్షికతో మంగళవారం 'అక్షరటుడే'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ధాన్యం తరలించేందుకు తగినన్ని లారీలను ఏర్పాటు చేస్తామని లింగంపేట్ తహశీల్దార్ సురేష్, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు నర్సింలు హామీ ఇచ్చారు. బుధవారం వారు సంయుక్తంగా మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. కల్లాల వద్దకు నేరుగా వెళ్లి రైతులతో మాట్లాడిన అధికారులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే గోదాములకు తరలించేందుకు లారీలను పంపిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రవాణా, హమాలీ ఛార్జీల పేరుతో రైతుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను తహశీల్దార్ సురేష్ హెచ్చరించారు. ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, తూకంలో తేడాలు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని సైతం నిబంధన ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు.



ఉమ్మడి జిల్లాలో వరుస దొంగతనాలు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేసవిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న చోరులు అందినకాడికి దోచుకెళ్తున్నారు. ఉక్కపోతను భరించలేక డాబా మీద పడుకుని తెల్లారి లేచి చూసేసరికి.. దొంగలు ఇళ్లను లూటీ చేస్తున్నారు. ఇలా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. చోరీలు పెరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

# ఉదయం రెక్కీ.. రాత్రికి చోరీ..

■ పోలీసులకు సవాల్‌గా చోరీలు ■ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు ■ భయాందోళనలో ప్రజలు
■ సీసీ కెమెరాలకు చిక్కకుండా దొంగతనాలు ■ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. రోజుకో ప్రాంతంలో చోరీలకు పాల్పడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని వర్ని, రుద్రూర్, కామారెడ్డి జిల్లాలో అన్నసాగర్, బీర్కూర్ గ్రామాల్లో ఒకే తరహాలో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ పగటి పూట రెక్కీ చేస్తూ సీసీ కెమెరాలకు చిక్కకుండా రోడ్డు మార్గం వాడకుండా దొంగతనాలకు ఈ ముఠాలు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

### భయాందోళనలో ప్రజలు..

వరుస దొంగతనాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగల ముఠా చోరీలకు పాల్పడటంతో ఇళ్లకు తాళాలు వేసి పండుగకు, పెళ్లిళ్లకు, శుభకార్యాలకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇన్ని రోజులు కష్టపడి కూడబెట్టిన బంగారం, వెండి, నగదును క్షణాల్లో దోచుకెళ్లిపోవ డంతో బాధిత కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నాయి. ఈ దొంగల ముఠాను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. వారి వేలిముద్రలు కూడా



సక్రమంగా దొరకకుండా జాగ్రత్త పడుతూ దొంగతనాలు చేస్తూ చిక్కకుండా పారిపోతున్నారు.

### పెట్రోలింగ్ ఓ వైపు.. చోరీలు మరోవైపు..

రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ చేసినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతూ బంగారం, డబ్బులు ఎత్తుకెళ్తున్నారు. ఒక చోటు నుంచి మరొక చోట వరుస క్షణాల్లో మారిపోతూ పోలీసులకు చిక్కకుండా దొంగల ముఠా విచ్చలవిడిగా చోరీలకు పాల్పడుతోంది. ఈ చోరీలు మొదలైనప్పటి నుంచి గ్రామాల్లో ప్రజలకు తెల్లవారుజాము వరకు కంటిమీద కునుకు లేకుండా గస్తీలు ఏర్పాటు చేసుకుని కాపలా కాస్తున్నారు. ఇన్ని వరుస చోరీలు జరిగిన ఇప్పటివరకు దొంగల ముఠాను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపణలు వస్తున్నాయి.

### బీర్కూర్‌లో..

బీర్కూర్‌లో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకే రాత్రి నాలుగు ఇళ్లలో చొరబడి తాళాలు పగలగొట్టి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. వర్ని మండలం శ్రీనగర్‌లో కొన్ని రోజుల క్రితం ఏకంగా ఏడు ఇళ్లలో చోరీ జరిగింది. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లో ఎనిమిది ఇళ్లలో దొంగలు పడి నగదు, బంగారం దోచుకెళ్లారు. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను, ఊరికి దూరంగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు.

### స్పష్టత లేని సీసీ పుటేజీలు..

చోరీ కేసులను ఛేదించేందుకు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించినా స్పష్టత రావడం లేదని పోలీసులు చెబుతున్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెంచామని, త్వరలోనే ముఠాను పట్టుకుంటామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని, ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు పొరుగింటి వారికి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

## దూద్‌గాంలో ఉచిత దంత వైద్య శిబిరం




**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని దూద్‌గాంలో శ్రీలక్ష్మి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ప్రశాంత్ గ్రామ ప్రజలకు దంత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబా, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అడవి లింగాల్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అడవి లింగాల్ గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని మంగళవారం అధికారులు నిర్వహించారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఫిర్దోజ్ ఈ కార్యక్రమానికి హాజరై రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరిలో అధిక దిగుబడినిచ్చే మేలు రకాల విత్తనాల ఎంపిక, వివిధ పంటల సాగు విధానం, పంటలపై ఆశించే చీడపీడలు, ఎరువుల యాజమాన్యం గురించి వివరంగా తెలిపారు. వరి పంట కోత తర్వాత మిగిలే కొయ్యలను, పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూసారం దెబ్బతింటుందని, పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని శాస్త్రవేత్త హెచ్చరించారు. బదులుగా వరి కొయ్యలను నీళ్లలో మురిగేలా కుళ్లబెట్టి పొలంలో కలియదున్నడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం అందుతుందని, దిగుబడులు పెరుగుతాయని వివరించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, ప్రతి పంటకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, మండల వ్యవసాయ అధికారిణి శోభ, ఏఈవో, జీపీవో, పంచాయతీ కార్యదర్శితో పాటు రైతులు ప్రతాప రెడ్డి, పోలీసు రాజు, శ్రీనివాస్ రెడ్డి, పోలీసు నాగరాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గుండ్ల చెరువు సమీపంలో మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ శివారులోని గుండ్ల చెరువు పక్కన ఖాళీస్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి 40 ఏళ్లు ఉంటాయని.. బూడిద రంగు ఫుల్ చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని వారు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లుగా కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించామని.. వివరాల కోసం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

## కంఠేశ్వర్ బైపాస్‌లో రోడ్డు ప్రమాదం.. వైద్యుడికి గాయాలు..



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** కారు అదుపు తప్పి వైద్యుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ నగర శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో వైద్యుడిగా పనిచేస్తున్న దశరథ్ సోమవారం అర్ధరాత్రి కంఠేశ్వర్ మీదుగా బైపాస్ వైపు వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అనంతరం వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు చేస్తాం..




**అక్షరటుడే, ఆర్మూర్ :** కులవివక్షకు వ్యతిరేకంగా కృషి చేసిన సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని పోరా టాలు చేస్తామని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య పేర్కొన్నారు. సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని యానంగుట్టలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కులవివక్షకు వ్యతిరేకంగా సుందరయ్య అవిశ్రాంతంగా పోరాడారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ నిర్మాణం చేసిన గొప్ప మేధావి అని అన్నారు. తన సొంత ఆస్తి మొత్తాన్ని పార్టీ కోసం ప్రజల కోసం అంకితం చేసిన త్యాగజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ నాయకులు భూమన్న, మస్రద్ బేగం, సాయిలు, రఫీ ఖాన్, రహీం ఖాన్, ప్రదీప్, సంధ్య, కుంతాబాయి, ముక్తార్, రాజు, పుష్ప, వాసవి, సంతు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత బలవన్మరణం..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అనారోగ్యంతో రైతు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎముల చిన్న లింగయ్య (71) వ్యవసాయం చేస్తుండేవాడు. అయితే కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కామారెడ్డిలో వైద్య చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 7:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి గ్రామ శివారులోని పస్కపోచమ్మ ఆలయం సమీపంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఎముల రామవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు వెళ్లి కుంటలో మునిగి యువకుడి మృత్యువాత

**అక్షరటుడే, బాన్సువాడ:** ఎండ వేడిని తట్టుకోలేక స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మంగళవారం బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలం హంగర్గా ఫారం గ్రామానికి చెందిన షేక్ అయాన్ (20) జీవనోపాధి కోసం ఇంటి నిర్మాణ పనుల్లో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం తరచూ బాన్సువాడ ప్రాంతానికి వచ్చేవాడు. మంగళవారం మధ్యాహ్నం తీవ్ర ఎండల నేపథ్యంలో స్నేహితులతో కలిసి సోమేశ్వర్ గ్రామంలోని స్టోన్ క్రషర్ల సమీపంలో ఉన్న చిన్నపాటి కుంట వద్దకు వెళ్లాడు. నీటిలోకి దిగి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతంలోకి వెళ్లి మునిగిపోయినట్లు సమాచారం. స్నేహితులు గమనించి అతడిని రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేక పోయింది. విషయం తెలిసిన స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం యువకుడిని నీటి నుంచి బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



## గాలివాన బీభత్సం.. 24 గంటలుగా విద్యుత్ లేక అవస్థలు..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలుల ధాటికి 15 చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో గండి మాసానిపేట్, కొత్తపల్లి, తిమ్మాపూర్, హాజీపూర్, బాలాజీ నగర్ తదితర గ్రామాలకు సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎండాకాలం కావడంతో 24 గంటలుగా కరెంటు లేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు వేడికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి సరఫరాకు మోటార్లు నడవక ప్రజలు నీటికష్టాలు అన్నీఇన్నీ కావు. మంగళవారం ఉదయం నుంచి ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతు పనులను వేగవంతం చేశారు. విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు, తెగిన వైర్ల బిగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అకాల వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, స్థానికంగా విద్యుత్ స్తంభాలు సరిపోకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సాయంత్రం లోపు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు.